కాలుష్య కోరల్లో మండపేట

- పరిశ్రమల యాజమాన్యాల నిర్లక్ష్యం
- సక్రమంగా అమలు కాని నిబంధనలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



పరిశ్రమల నుంచి వెలువడుతున్న పొగ

మండపేట: రోజురోజుకు కాలుష్యం ఎక్కువవుతోంది. ఏళ్ల తరబడి ఈ సమస్య పట్టణాన్ని పట్టిపీడిస్తోంది. కొన్ని పరిశ్రమలు నిబంధనలు పాటించకపోవడం, కాలుష్య నియంత్రణ చర్యలు గాలికొదిలేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సమస్యపై కౌన్సిల్ సమావేశాల్లోను సభ్యులు ధ్వజమెత్తుతున్నారు. పట్టణంలో దాదాపు 30కు పైగా రైస్ మిల్లులతో పాటు ఆయిల్ ఫ్యాక్టరీలు, ఇతర పరిశ్రమలు విస్తరించి ఉన్నాయి. పారిశ్రామికంగా మండపేటకు మంచి గుర్తింపు తీసుకురావడంతో పాటు ఈ పరిశ్రమల ద్వారా వేలాది మందికి ఉపాధి లభిస్తోంది. గతంలో ఇవి పట్టణానికి దూరంగా ఉండగా పట్టణ జనావాసాలు విస్తరిస్తుండడంతో అవి నివాస గృహాలకు చేరువయ్యాయి. పలు పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది.

అమలు కాని నిబంధనలు

కాలుష్య నియంత్రణకు సంబంధించి పొగ గొట్టాల ఎత్తు పెంచడం, చెట్లు పెంచడం, కాలుష్య జలాలను శుద్ధి చేసేందుకు చెరువుల ఏర్పాటు తదితర నిబంధనలు కొన్ని పరిశ్రమల్లో సమక్రమంగా అమలుకావం లేదు. కలుషిత నీటిని చెరువుల్లో ఫిల్టరింగ్ వ్యవస్థ ద్వారా శుద్ధి చేసుకోవాల్సి ఉండగా, కొన్ని పరిశ్రమల వారు కలుషిత జలాలను నేరుగా పంటబోదెలలోకి విడుదల చేస్తున్నారన్న విమర్శలున్నాయి. పరిశ్రమల నుంచి వెలువడుతున్న బూడిద, ఊకలు సమీపంలోని ఇళ్లను కమ్మేస్తున్నాయి. ప్రధానంగా మేదరపేట, సైదిల్‌పేట, గాంధీనగర్, సంగంపుంత రోడ్డు, టౌన్‌హాల్ ఏరియా తదితర ప్రాంతాల్లో కాలుష్యం సమస్య అధికంగా ఉంటోందని స్థానికులు అంటున్నారు. శీతాకాలం, వర్షాకాలం కంటే వేసవిలో సమస్య తీవ్రత అధికంగా ఉంటోందంటున్నారు. ఇంటిపైన దుస్తులు ఆరేస్తే కొద్దిసేపటికే బూడిదతో నిండిపోతున్నాయని, వాకిళ్లు తరచూ శుభ్రం చేసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై ఎన్నోమార్లు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా ఫలితం లేదని స్థానికులు అంటున్నారు.

కౌన్సిల్‌లో విన్నవించినా..

ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష సభ్యులు కాలుష్యం సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గతంలో ప్రజలు ఆందోళనలు చేసిన సమయంలో కాలుష్య నియంత్రణ అధికారులు వచ్చి పరిశ్రమల యాజమాన్యాల నుంచి మామూళ్లు తీసుకుని వెళ్లిపోవడం తప్ప సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు కోరారు. కాలుష్య నియంత్రణ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు తెలిపారు.

వెంటనే చర్యలు తీసుకోండి



కాలుష్యం సమస్య ఎక్కువగా ఉంది. దీర్ఘకాలంగా సమస్య పట్టి పీడిస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ప్రజల అనారోగ్యంపాలవుతున్నారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా అధికారులు వెంటనే చర్యలు తీసుకోని సమస్యను పరిష్కరించాలి.

– జొన్నపల్లి విజయలక్ష్మి, 24వ వార్డు కౌన్సిలర్

ఇబ్బంది పడుతున్నాం



కాలుష్యం సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వాకిళ్లు, దాబాలు బూడిదతో నిండిపోతున్నాయి. ఇంట్లో ఏ వస్తువు పెట్టుకున్న నల్లగా పోయిపోతంది. ఇంటిపై ఆరేసుకున్న దుస్తుల నిండా బూడిద చేరుతోంది.

– పంపన నూకరత్నం, సైదిల్‌పేట

విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా భీమశంకరం



భీమశంకరంను అభినందిస్తున్న విశ్వబ్రాహ్మణ నాయకులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కొసనా భీమశంకరం ఎన్నికయ్యారు. గ్రామంలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు కట్టోజు సన్యాసు, జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు తాళబత్తుల అప్పాలాచార్యులు, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుపాటి వేణుగోపాల్, సహాయ కార్యదర్శి గంగా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం ఈ ఎన్నిక నిర్వహించారు. కొసనా భీమశంకరం తన ప్రత్యర్థి కణితి రాంబాబుపై 14 ఓట్లు మెజార్టీతో గెలిచినట్టు నిర్వాహక కమిటీ ప్రకటించింది. భీమశంకరంను సంఘ పెద్దలు గారోజు సూరిబాబు, కాల్దారి వెంకటేశ్వరరావు, నెల్లూరి సత్య శ్రీనివాస్, కొసనా కామేశ్వరరావు, అమలాపురం విశ్రబ్రాహ్మణ యువత కోసూరు చదంబరాచారి, బొల్లోజు మణిశ్రీకాంత్ తదితరులు అభినందించారు.

వైఎస్సార్ కంటి వెలుగుతో అంధత్వానికి చెక్



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు సత్యనారాయణ, చిత్రంలో కౌన్సిలర్ సతీష్

మండపేట: అంధత్వ సమస్య పరిష్కారానికి వైఎస్సార్ కంటి వెలుగు పథకం ఎంతో దోహదపడుతోందని 2వ వార్డు కౌన్సిలర్ చిట్టూరి సతీష్ పేర్కొన్నారు. స్థానిక ఒకటో సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సతీష్ మాట్లాడుతూ కంటి వెలుగు వైద్య శిబిరాలు ద్వారా ముందుగానే కంటి సమస్యలు గుర్తించి అవసరమైన వైద్యసాయం అందించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని అమలుచేస్తున్నారన్నారు. ఈ పథకం కింద కంటి చూపు మెరుగుపర్చేందుకు ఉచితంగా కళ్లజోళ్లు, మందులు అందించడంతో పాటు శస్త్రచికిత్సలు చేయిస్తారన్నారు. కంటి వైద్య నిపుణులు ఎస్.సత్యనారాయణ 70 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 20 మందికి కళ్లజోళ్లు అవసరంగా గుర్తించారు. వారికి త్వరలో కళ్లజోళ్లు అందించనున్నట్టు డాక్టర్ సత్యనారాయణ తెలిపారు. శస్త్ర చికిత్స అవసరమైన వారిని రామచంద్రపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయిస్తామన్నారు.

ఆధార్ నమోదు వేగవంతం చేయాలి



సమావేశంలో సూచనలిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

రాయవరం: ఆరు నెలల లోపు చిన్నారుల నుంచి ఆరేళ్ల వయస్సు గల వారికి ఆధార్ నమోదు వేగవంతం చేయాలని ఎంపీడీవో డి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల పరిషత్ సమావేశపు హాలులో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులకు సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఆరు నెలల వయస్సు లోపు చిన్నారులు 74, ఆరు నుంచి ఆరు నెలల లోపు చిన్నారులు 398 మంది ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయన్నారు. ప్రతి ఒక్క చిన్నారి ఆధార్ నమోదుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులకు ఈకేవైసీ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్వే పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం



అపార్ట్‌మెంట్ సన్‌షేడ్‌పై చెలరేగుతున్న మంటలు

అనపర్తి: స్థానిక శేషగిరిరావుపేటలోని ఓ అపార్ట్‌మెంట్ గ్రౌండ్‌ఫ్లోర్‌లో బుధవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. దీనికి సంబంధించి అనపర్తి అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఈ–స్టోర్ ఇండియా పేరుతో నిర్వహిస్తున్న సూపర్‌మార్కెట్ సన్‌షేడ్‌పై ఉన్న విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పురవ్వలు చెలరేగి అక్కడే ఉన్న అట్టపెట్టెలపై పడడంతో మంటలు వ్యాపించాయి. దీనిని గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి, విద్యుత్‌శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. విద్యుత్‌శాఖ సిబ్బంది సరఫరాను నిలిపివేశారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేయడంతో పెనుప్రమాదం తప్పింది.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాలకు మౌలిక వసతుల కల్పనతో పాటు రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారం శివారు అల్లాడస్వామి నాయుడు కాలనీలో రహదారిని బుధవారం పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ కాలనీలో రూ.5 లక్షలతో రెండు విడతలుగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మట్టపర్తి చంద్రశేఖర్, ఎంఎం శెట్టి, విత్తనాల శేఖర్, రాయుడు కృష్ణమహేష్, రాయుడు స్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గొల్లపాలెం 333/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప మండలాల్లోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. కాజులూరు సబ్‌స్టేషన్ పరిధిలోని కాజులూరు, తిప్పరాజుపాలెం, అయితపూడి, ఒంటితాడి తదితర గ్రామాలకు, గొల్లపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని గొల్లపాలెం, ఆర్యావటం, శలపాక, తణుకువాడ, డేగలపేట, మొగలిపాలెం, శీల, మంజేరు, చేదువాడ, బందనపూడి, మతుకుమిల్లి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. అదేవిదంగా కరప మండలం యండమూరు ఆక్వా, ఇండ్రస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని పెద్దాపురపాడు, యండమూరు, విజయరాయుడుపాలెం, జగన్నాథగిరి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: చోడవరం 33/11కేవీ సబ్‌స్టేషన్, 11కేవీ రామలింగేశ్వర ఫీడర్ల పరిధిలో మరమ్మతులు, చెట్ల నరికివేత పనులు జరగుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పట్టణ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ బుధవారం విలేకరులకు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ రామచంద్రపురం, ఓదూరు ఆక్వా సర్వీసులు, నరసాపురపుపేట ఆక్వా సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

రేపు జాబ్ మేళా

అనపర్తి: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాను శుక్రవారం స్థానిక జీబీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాటు చేసినట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాకు ప్రముఖ టెక్ మహేంద్ర, ఏఏఎం జియో స్పాటియల్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, ముతూట్ ఫైనాన్స్ తదితర కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఆయా కంపెనీల్లో వివిధ ఉద్యోగాలకు గాను బి.టెక్, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఎస్సీ కెమిస్ట్రీ, బీకాం, ఎం ఫార్మసీ, బీ ఫార్మసీ, డీ ఫార్మసి, పీజీ, డిప్లొమా, ఎంఎస్‌సీ కెమిస్ట్రీ, బి.ఫార్మసితోపాటు పదో తరగతి, ఇంటర్ (పాస్ లేదా ఫెయిల్) 19 నుంచి 30 ఏళ్లు ఉన్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు పోస్ట్, విద్యార్హత, కంపెనీ, అనుభవం ఆధారంగా సుమారు రూ.10వేల నుంచి 30 వేల వరకూ వేతనం ఉంటుందని తెలిపారు. ఈ నెల 12న నిర్వహించే జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులను ఇంటర్వ్యూ నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థులు తమ పూర్తి వివరాలను rhortur.at/qnu12 వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. అభ్యర్థులు బయోడేటా, సంబంధిత జిరాక్స్ కాపీలతో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి జీబీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలను 9550882754, 9581810049 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పాపారాయుడికి చిన్న జీయర్ స్వామి పరామర్శ



పాపారాయుడును పరామర్శిస్తున్న చిన్న జీయర్ స్వామి

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో ట్రస్ట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడును చిన్న జీయర్ స్వామి బుధవారం పరామర్శించారు. ఆస్పత్రిలో కర్రి పాపారాయుడుతో స్వామిజీ మాట్లాడి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంగా కోలుకోవాలని ఆశీర్వచనం అందించారు. ఆయనతోపాటు పాపారాయుడు కుటుంబ సభ్యులు, ట్రస్ట్ ఆస్పత్రి డైరెక్టరు రామకృష్ణ ఉన్నారు.

డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ గ్రామంలో రూ.5 లక్షల నిధులతో చేపట్టే డ్రైన్ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నున్న సత్యవతి, ఎంపీపీ అంబటి భవాని, గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, వార్డు సభ్యులు డేగల వెంకటరమణ, సాక్షి పద్మనాభం, పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాహుల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శివ పాల్గొన్నారు.

అగ్నిగుండం

- మండుతున్న ఎండలు
- బెంబేలెత్తిపోతున్న ప్రజలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



వెలవెలబోతున్న కేపీ రోడ్డు



వేడిగాలుల నుంచి రక్షణగా..

మండపేట: ద్రోణి ప్రభావంతో వారం రోజుల పాటు కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడగా గత రెండు రోజులుగా కాస్తున్న ఎండలు అగ్నిగుండాన్ని తలపిస్తున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు నిప్పుల కొలమిగా మారుతున్నాయి. ఎండ వేడిమి తాళలేక రోడ్లుపైకి రావాలంటేనే జనం హడలెత్తిపోతున్నారు. బుధవారం మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండకు వేడిగాలులు వీయడంతో మరింత మంటపుట్టిస్తోంది. భానుడి భగభగలతో ఇళ్లలోంచి బయటకు రావాలాంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. వాణిజ్య కేంద్రాలైన మండపేట, రామచంద్రపురం పట్టణాల్లో మధ్యాహ్నం 12 గంటల సమయానికే దాదాపు షాపులన్నీ మూతపడుతున్నాయి. నిత్యం జనంతో రద్దీగా ఉండే మండపేటలోని మెయిన్‌రోడ్డు, కేపీ రోడ్డు, బస్టాండు, కలువపువ్వు సెంటర్లు సాయంత్రం ఐదు గంటల వరకు జనసంచారం లేక వెలవెలబోతున్నాయి. ఎండ వేడిమితో అల్లాడుతున్న జనానికి, వేడి గాలులు మరింత ఇబ్బంది పెడుతున్నాయి. ఇళ్లలోని వాటర్ ట్యాంకుల్లో నీరు వేడెక్కిపోతోంది. గృహోపకణాలు సైతం వేడిగా తయారై ఎండల తీవ్రతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. వాటిని పట్టుకోవడానికి అసౌకర్యానికి గురికావాల్సి వస్తోంది. ఎండల తీవ్రత నుంచి ఉపశమనం కోసం శీతల పానీయాలకు డిమాండ్ పెరుగుతోంది. జ్యూస్‌లతో పాటు రోడ్ల వెంబడి ఎక్కడిక్కడ చెరుకు రసం, పుచ్చకాయలు, కొబ్బరిబొండాలు, తాటి ముంజెల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

జాగ్రత్తలు తీసుకోవాలి

ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నంతసేపు బయటకు రావకపోవడమే మేలని వైద్య నిపుణులు చెబుతున్నారు. విపరీతమైన తలనొప్పి, తీవ్ర జ్వరం, మగతనిద్ర, లేదా కలవరింపులు, ఫిట్స్, పాక్షికంగా అపస్మారకస్థితి ఉంటే వడదెబ్బ లక్షణాలుగా గుర్తించి వెంటనే ప్రాథమిక చికిత్స అందించాలని సూచిస్తున్నారు. వెంటనే చల్లని ప్రదేశానికి చేర్చి, చల్లని గుడ్డతో శరీరాన్ని తుడవడంతో పాటు చల్లనిగాలి తగిలేవిధంగా చూడాలంటున్నారు. వైద్యసాయం నిమిత్తం దగ్గర్లోని ఆస్పత్రికి తరలించాలని వైద్యనిపుణులు చెబుతున్నారు.

క్లుప్తంగా

వంతెనను పునర్నిర్మించాలి



శిథిలావస్థలో ఉన్న వంతెన

కాజులూరు: ఆర్యావటంలో ముత్తావారి గరువు వద్ద కురాడ డ్రైన్‌పై శిథిలావస్థలో ఉన్న వంతెనను పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ముత్తావారి గరువు నుంచి ఆర్యావటం వెళ్లేందుకు సుమారు 20ఏళ్ల క్రితం అధికారులు డ్రైన్‌పై కాలిబాట వంతెనను నిర్మించారు. నిర్మాణ సమయంలో నాణ్యతా లోపించడంతో కొద్ది రోజులకే శిథిలస్థితికి చేరుకుంది. ప్రస్తుతం వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు విరిగిపోయి అప్రోచ్‌లు కరిగిపోయి ఉన్నాయి. సైకిల్, మోటారుసైకిల్ వంటి వాహనాలు ప్రయాణించాలంటే ఏ మాత్రం వీలులేకుండా ఉంది. పాదచారులు సైతం తప్పనసరి పరిస్థితుల్లో భయం భయంగా వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి వంతెన పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠ పూజలు

కపిలేశ్వరపురం: కోరుమిల్లిలో గౌతమి గోదావరి ఒడ్డున నూతనంగా నిర్మించిన ఆలయంలో అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు రెండు రోజుల నుంచి ఆలయం వద్ద పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కె.గంగవరం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్టు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని పామర్రు సచివాలయం పరిధిలో ఒకటి, శివలలో ఒకటి, యండగండిలో ఒకటి, యర్రపోతవరంలో ఒకటి ఉన్నాయి. ఈ పోస్టులకు ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 11వ తేదీలోపు ఆయా గ్రామాల్లోని సచివాలయంలో గాని, ఆన్‌లైన్‌లో గాని దరఖాస్తు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జూన్ 15వ తేదీన ప్రభుత్వం నియమించిన కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి పోస్టింగ్ ఇస్తామని చెప్పారు.

రైతులను ఆదుకోవాలి

కాజులూరు: వర్షాలు కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. బుధవారం మండలంలోని ఒంటితాడి, కాజులూరు, శీల తదితర గ్రామాల నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. వర్షాలకు నీట తడిసిన వరి పొలాలను, ధాన్యం రాశులను పరిశీలించారు. ఒంటితాడిలో ఆయన మాట్లాడుతూ తడిసిన, రంగుమారిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరకు కల్పించాలని, ప్రతి రైతుకు ఇన్పుట్ సబ్సిడీ, నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంపై కౌలురైతు సంఘం నాయకులు కోనసీమ, కాకినాడ జిల్లా కలెక్టర్లను కలిసి వినతిపత్రం సమర్పించామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రామచంద్రపురం: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఒక ఫర్నిచర్ షాపు ఎదురుగా గుర్తు తెలియన వ్యక్తి మృతి చెందడంతో గమనించి స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు రామచంద్రపురం ఎస్సై డి.సురేష్‌బాబు బుధవారం విలేకరులకు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 36ఏళ్లు ఉండవచ్చన్నారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో మృతుడు గత నెల 22న పి.శ్రీనివాస్ పేరుతో చికిత్స పొందినట్టు గుర్తించామన్నారు. అయితే అతని వివరాల కోసం పరిసర ప్రాంతాల్లో విచారించగా ఎటువంటి ఆచూకీ తెలియలేదన్నారు. మృతుని వివరాలు ఎవరికైనా తెలిస్తే రామచంద్రపురం పోలీస్ స్టేషన్‌లో సమాచారం తెలియజేయాలని కోరారు. వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్ 08857 242333, 94407 96589 నంబర్లకు తెలియజేయాలని తెలిపారు.

రేపటి నుంచి శ్రీలక్ష్మీ మహాయజ్ఞం

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 17వ తేదీ వరకూ విజయవాడలో అష్టోత్తర శతకుండాత్మక(108) చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం నిర్వహించనున్నారు. ఈ యజ్ఞానికి భక్తులు తరలివెళ్లాలని ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి దేవస్థానం ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి(తారకేశ్వరరావు) బుధవారం విలేకరులకు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యజ్ఞ సంకల్పం తీసుకుంటారని, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, సాధనికుమారి దంపతులు యజ్ఞ దీక్ష చేపడతారన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు



కూలీలతో కలిసి తుప్పలను తొలగిస్తున్న ఎంపీటీసీ ప్రసాద్

కె.గంగవరం: గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి నిబంధన ప్రకారం ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని కూళ్ల సచివాలయం శివారు గ్రామాలైన మల్లవరం, తమ్మయ్యపాలెం, నరజడ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు ముందుగా ప్రాధాన్యత కలిగిన పంట బోదులను శుభ్రం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎండ తీవ్రత తక్కువగా ఉన్న సమయంలో పని చేసి వడదెబ్బకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి కూలీలతో కలసి ఆయన కూడా తుప్పలను తొలగించి కూలీలకు సూచనలు చేశారు.

విజ్ఞానం పెంచేందుకే వేసవి శిక్షణ



రాయవరం గ్రంథాలయంలో విద్యార్థులు

రాయవరం: విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం శాఖా గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ సూచించారు. రాయవరంలో వేసవి శిక్షణ శిబిరాన్ని ఎంపీపీ వెంకటరమణ బుధవారం సందర్శించారు. విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞానాన్ని పెంపొందించేందుకు తల్లిదండ్రులు కూడా తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం చేయడం ద్వారా అపారమైన జ్ఞానాన్ని పొందుతారన్నారు. లైబ్రేరియన్ రత్నాబాయి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

14న మహిళల చదరంగం పోటీలు

ప్రకాశం నగర్: స్థానిక శ్రీగౌతమి స్మార్ట్ స్కూల్‌లో జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో 14న జిల్లా ఓపెన్ మహిళా విభాగం చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలిచిన క్రీడాకారులు ఏపీ చెస్ డాట్ ఓఆర్‌జీ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇందులో మొదటి నాలుగురు విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని చెప్పారు. మరిన్ని వివరాలకు 98483 74133 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.